
సాక్షి ఒడిశా

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 4,32,326

బంగారం 5 గ్రాములు 800 మిల్లీ గ్రాములు

వెండి 27 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

నారాయణీ నమోస్తుతే..!

దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

- IIలో





వైభవంగా సునావేశ సంబరం

జయపురం మహారాజుల ఆరాధ్య దైవమైన మా దిక్షణ కాళీకి సునావేశ సంబరం ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

- IIలో

న్యూస్‌రీల్

కారు-బస్సు ఢీ

- ఐదుగురికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో బస్సు

బరంపురం: నగర సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ఐఐసీ అధికారి అభిమన్యు దాస్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 5 గంటల సమయంలో గంజాం పోలీసు స్టేషన్ పరిధి రంబా అగ్రికల్చర్ శిక్షణ కళాశాల ఎదురుగా జాతీయ రహదారిపై జయపూర్ నుంచి వస్తున్న ప్రయాణికుల బస్సు, బరంపురం వెళ్తున్న కారు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు స్పందించి 108 అంబులెన్సులో ఎంకేసీజీ మెడికల్ కళాశాలకు తరలించారు. డ్రైవర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. గంజాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారులకు గాయాలు





గాయపడిన గణ పెంటియ, సురేష్ పెంటియ

జయపురం: బొరిగుమ్మ-జయపురం మధ్య 26వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారులకు తీవ్ర గాయాలయ్యాయి. జయపురం సమితి కుములిపుట్ గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో గాయపడిన తండ్రీకుమారులను రామనగుడ ప్రాథమిక ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కొరాపుట్‌లోని సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించి వైద్యమందించారు. బాధితులు కుములిపుట్ పంచాయతీ డుటిగుడ గ్రామానికి చెందిన గణ పెంటియ, సురేష్ పెంటియలుగా పోలీసులు గుర్తించారు.

పది మంది జూదరుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగదు

జయపురం: పేకాట శిబిరంపై దాడి చేసి పది మంది జూదరులను అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసు తెలిపారు. శుక్రవారం రాత్రి 1.30 గంటల ప్రాంతంలో జయపురం భద్రయ్య వీధిలో జూద శిబిరంపై ఏఎస్‌ఐ బిజయ కృష్ణ పట్నాయక్ నేతృత్వంలో సిబ్బంది దాడులు జరిపారు. పది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.25200 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు సబ్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ నాయిక్ తెలిపారు.

గంజాయి స్వాధీనం



పోలీసులకు చిక్కిన నిందితుడు

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబాదొళ వద్ద శాంతి కూడలిలో శుక్రవారం రాత్రి గంజాయి పట్టుబడింది. ఓ వ్యక్తి అనుమానాస్పదంగా బస్తా కనిపించడంతో తనిఖీ చేశారు. బస్తాలో 5 కిలోల 680 గ్రాముల గంజాయి గుర్తించారు. నిందితుడ్ని అరెస్టు చేసి శనివారం కోర్టుకు తరలించారు. అరెస్టయిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

9.05 గ్రాముల బ్రౌన్‌షుగర్ సీజ్

బరంపురం: రఘుపతినగర్‌లో ఓ ఇంటిపై పోలీసులు దాడి చేసి 9.05 గ్రాముల బ్రౌన్ షుగర్‌ను సీజ్ చేశారు. ఈ ఘటనలో తల్లి, ఇద్దరు కుమారులను అరెస్టు చేశారు. ఎస్‌డీపీఓ అశ్వినీకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..శనివారం పెద్ద బజార్ పోలీసుస్టేషన్ పరిధిలో రఘుపతినగర్‌లో ఓ ఇంట్లో పోలీసులు పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించారు. బ్రౌన్ షుగర్‌ను సీజ్ చేసి బెంగునియాపడా గ్రామానికి చెందిన పూజ ప్రధాన్, ఆమె కుమారులు బికాష్‌కుమార్ ప్రధాన్, ఆకాష్‌కుమార్‌లను అరెస్టు చేశారు.

త్యాగధనులను స్మరిద్దాం

- పోలీసు సంస్మరణ దినోత్సవంలో డీజీపీ సునీల్‌కుమార్ బన్సాల్
- అమరవీరులకు ఘన నివాళులు



భువనేశ్వర్: ఒడిశా పోలీసు ప్రధాన కార్యాలయంలో అమర జవానులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న డీజీపీ సునీల్ కుమార్ బన్సాల్

భువనేశ్వర్: విధి నిర్వహణలో ప్రాణాలకు తెగించి పోరాడి అమరువీరులైన పోలీసులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఒడిశా డీజీపీ సునీల్‌కుమార్ బన్సాల్ అన్నారు. ఒడిశా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం 64వ పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా డీజీపీ, ఇతర సీనియర్ అధికారులు విధి నిర్వహణలో అమరులైన పోలీసులు, కేంద్ర పాలిత రాష్ట్రాల పోలీసు బలగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు ఘన నివాళులర్పించారు. పోలీసుల శౌర్యం , త్యాగం వెలకట్టలేనివని కొనియాడారు.

- **బరంపురం:** విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న పోలీసు అమర జవానుల త్యాగాలు మరువలేనివని దక్షిణాంచల్ ఐజీ సత్యబ్రత్ బొయి కొనియాడారు. శనివారం అంబపువా పోలీసు రిజర్వు మైదానంలో పోలీసు సాహిద్ దినోత్సవం నిర్వహించారు. ఐజీతో పాటు బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు వేసి అంజలి ఘటించారు. గంజాం జిల్లా ఛత్రపూర్ పోలీసు మైదానంలోనూ పోలీసు సాహిద్ దివస్ ఉత్సవలు నిర్వహించారు.
- **కొరాపుట్:** పోలీసు అమరవీరుల త్యాగాలను జాతి మరువదని దక్షిణ పశ్చిమాంచల్ రేంజ్ డీఐజీ చరణ్ సింగ్ మీనా అన్నారు. శనివారం కొరాపుట్ పోలీస్ గ్రౌండ్స్‌లో పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ అభినవ్ శంకర్‌తో కలసి అమరు పోలీసు జవానుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు.
- **పర్లాకిమిడి:** బెత్తగుడ పోలీసు బెటాలియన్ గ్రౌండ్స్‌లో పోలీసు అమరవీరుల సాహిద్ దివాస్‌లో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ పాల్గొని అమరుల స్థూపాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పోలీసుపరేడ్‌లో గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు అమరవీరులు బిశ్వజిత్ జెన్నా, సింహాచల ప్రధాన్ కుటుంబ సభ్యులకు దుశ్శాలువతో సన్మానించారు.
- మల్కన్‌గిరి జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ నీతిష్ వాద్వానీ ఆధ్వర్యంలో పోలీసులు పెరేడ్ నిర్వహించారు. మావోయిస్టుల ఎదురుకాల్పుల్లో మృతిచెందిన వారికి నివాళులు అర్పించారు.



భువనేశ్వర్:పూరీ పోలీసు గ్రౌండ్‌లో అమర జవానులకు శ్రద్ధాంజలి ఘటించిన ఎస్పీ



భువనేశ్వర్:అమర జవాన్ల స్మారక స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించిన కటక్, భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి



భువనేశ్వర్: అమర జవానులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న పోలీసు సిబ్బంది



బరంపురం : పోలీసు సాహిద్ స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీనా



బరంపురం : అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐజీ సత్యబ్రత్ బొయి, ఎస్పీ సార్వణ్ వివేక్



బరంపురం: అమరవీరుల స్మరణలో గంజాం పోలీసులు



కొరాపుట్: ప్రసంగిస్తున్న డీఐజి చరణ్ సింగ్ మీనా



సాహిద్ పోలీసు దివాస్‌లో శ్రద్ధాంజలి ఘటిస్తున్న రిజర్వ్ పోలీసు అధికారులు



పర్లాకిమిడి: అమరవీరుల స్మృతి స్థూపం వద్దకు అంజలి ఘటించేందుకు వెళ్తున్న ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్



పర్లాకిమిడి: పోలీసు అమరవీరుల కుటుంబాలు, సిబ్బందితో ఎస్పీ, కలెక్టర్



కొరాపుట్ : అమర జవాన్లకు నివాళులు అర్పిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



మల్కన్‌గిరి: అమరవీరుడికి నివాళులు అర్పిస్తున్న పోలీసులు



మల్కన్‌గిరి: పెరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు

బస్సు బీభత్సం

భువనేశ్వర్: నగరంలో శుక్రవారం రాత్రి వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. 60వ నంబరు మో బస్ పలు వాహనాలను ఢీకొట్టింది. రూట్ నంబర్ 60లో పలు ప్రాంతాల గుండా తిరిగే ఈ బస్సు వరుసగా వాహనాలను ఢీకొనడంతో కొన్ని చోట్ల ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటనల్లో పలువురు బాధితులు చంద్రశేఖర్ పూర్ ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదాలకు కారణమైన మో బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



ప్రమాదానికి కారణమైన మో బస్సు

దూరప్రాంతాలకు వెళ్తే చెప్పండి

భువనేశ్వర్: దసరా ఉత్సవాల సందర్భంగా దూర ప్రాంతాలకు వెళ్లే వారు ఇంట్లో వస్తువులు, నగలు, ఆభరణాలు ఇతరత్రా సామగ్రి విషయంలో అప్రమత్తంగా ఉండాలని కమిషనరేట్ జోన్-2 ఏసీపీ గిరిజా చక్రవర్తి సూచించారు. స్థానిక మీడియాతో శనివారం ఆయన మాట్లాడుతూ దొంగలు, దోపిడీదారులకు అవకాశం లేకుండా, తమ విలువైన ఆభరణాలు, వస్తువుల్ని ఇంట్లో భద్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్నప్పుడు ఇరుగు పొరుగు, సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తరచూ పీసీఆర్ వ్యాన్‌తో పహారా ఏర్పాటు చేస్తామన్నారు.



గిరిజా చక్రవర్తి, జోన్ 2 ఏసీపీ

నాటుసారా బట్టీలపై దాడులు

జయపురం: కొలాగుడ గ్రామ సమీపంలో నాటుసారా తయారు చేస్తున్న బట్టీపై జయపురం సదర్ పోలీసులు శనివారం దాడులు చేపట్టారు. 200 లీటర్ల సారాను ధ్వంసం చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి ఆదేశాల మేరకు పది మంది పోలీసులు ఈ దాడుల్లో పాల్గొన్నారు.



ధ్వంసమైన సారాబట్టీ

అదిగో పులి!

- ట్రాప్ కెమెరాలకు చిక్కిన పులి
- గొప్పిలి, రౌతుపురం వైపు పయనం
- భయాందోళనలో గ్రామస్తులు
- ఒంటరిగా తిరగొద్దని ప్రజలకు అటవీశాఖ అధికారుల సూచన

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ సమితి గండాహాతి పంచాయతీ సంతోష్‌పూర్ గ్రామంలో పులి సంచరిస్తున్న అనుమానాలు నిజమయ్యాయి. ఈ నెల 18న గ్రామంలో ఓ ఆవు గుర్తు తెలియని జంతువు దాడిలో మృతి విషయం తెలిసిందే. అటవీశాఖ అధికారులు భువనేశ్వర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించగా అవి పులి పాదాలుగా నిర్ధారించారు. దీంతో సంతోష్‌పూర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి పులి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్టు డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించారు. ఏడు అడుగుల పొడవున పులి ఉందని అటవీ అధికారులు చెప్పారు. స్థానికులు ఒంటరిగా అడవిలో వెళ్లవద్దని సూచించారు. పులి కదలికలు గమనించేందుకు గజపతి జిల్లా నారాయణపూర్ అటవీ రేంజ్ అధికారులు ముగ్గురు, గార్డులు 40 మందిని నియమించింది. చెట్లకు పది సీసీ కెమెరాలు బిగించారు. పులి కదలికలపై నిఘా పెట్టినట్లు ఏసీఎఫ్ అధికారి అశోక్‌కుమార్ బెహరా 'సాక్షి'కి తెలిపారు. ఒడిషా సరిహద్దు దాటి శ్రీకాకుళం జిల్లా వైపు బుర్జిలి జంక్షన్ వద్ద పులి అడుగు జాడలు కనిపించినట్టు చెప్పారు. అక్కడి నుంచి పలాస మండలం గొప్పిలి, రౌతుపురం వైపు ప్రయాణం చేస్తున్నట్టుపాదముద్రలు ద్వారా కనుగొన్నామని వివరించారు.



డ్రోన్ కెమెరాలకు చిక్కిన పులి



పొలాల్లో పులి అడుగుజాడలు



సంతోష్‌పూర్ వద్ద చెట్లకు కెమెరాలను అమర్చుతున్న సిబ్బంది



పులి అడగుజాడలను పరీక్షిస్తున్న ఏసీఎఫ్ అశోక్ కుమార్ బెహరా, అటవీ సిబ్బంది

క్లుప్తంగా

నేటి నుంచి బహడపల్లిలో జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లిలో ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న ట్టు గ్రామస్తులు, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. శ్రీచండేశ్వరి గ్రామదేవత ఆశీస్సులతో విజయదశమి సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీ య, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ. 10,016లు, రూ.8,016లు, రూ.5,016లు, రూ.5,016లతో పాటు షీల్డ్ కూడా అందజేస్తా మని తెలిపారు. బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్, బెస్ట్ ఆల్‌రౌండర్లకు షీల్డ్, నగదు అందజేస్తామన్నారు. నిబంధనల ప్రకారం జరిగే ఈ పోటీల కు సంబంధించి మరిన్ని వివరాలకు నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆక్రందన దీక్షలో ఆయన పాల్గొన్నారు. తాము పంపిన ప్రతిపాదనలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండిపోయాయని, వాటిని పరిష్కరించాలన్నారు.

వలస మత్స్యకారుడు మృతి

రణస్థలం: మండలంలోని జీరుపాలెం గ్రామానికి చెందిన మాగుపల్లి హరిబాబు(52) కుటుంబ పోషణ కోసం కర్ణాటక వలస వెళ్లి అక్కడ మృతి చెందినట్లు ఆ గ్రామ సర్పంచ్ మాగుపల్లి రాముడు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు జిల్లాలో గల మలిపి గ్రామంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్లు సమాచారం వచ్చినట్లు చెప్పారు. శనివారం ఉదయం అలల ఉధృతికి నీటిలో ప్రమాదవశాత్తు పడి చనిపోయారని చెప్పారు. మృతునికి భార్య రాము, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దీనిపై అక్కడ కేసు నమోదైనట్లు చెప్పారు.

నేడు అరసవల్లిలో ఎముకల ఖనిజ సాంద్రత ఉచిత పరీక్షలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిసరాల్లో ఆదివారం జండూ ఫార్మా కంపెనీ వారి సౌజన్యంతో ఉచితంగా ఎముకల ఖనిజ సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా జండూ ఫార్మా ఇన్‌చార్జి రామ్ తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు ఈ అవకాశా న్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రముఖ వై ద్యులు పొన్నాన వెంకటరమణమూర్తి, టి.బ్రహ్మంలు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యపరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై జిల్లా స్థాయి సమీక్షను జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ శ్రీధర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ఎక్కువ విస్తీర్ణంలో క్షేత్రస్థాయిలో రైతులతో తీసుకెళ్లాలని కోరారు. రైతులతో ఆదాయం వచ్చే విధంగా పలు పంటల విధానాలను చేయించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి రేవతి, రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరాంధ్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది'



మాట్లాడుతున్న బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నర్సింహారావు, పక్కనే జిల్లా నేతలు

శ్రీకాకుళం న్యూకాలనీ, అరసవల్లి: ఉత్తరాంధ్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు పేర్కొన్నారు. శనివారం శ్రీకాకుళం వచ్చిన ఆయన ఆదిత్యుని దర్శనం అనంతరం స్థానికంగా ఓ ప్రైవేటు హోట ల్లో బీజేపీ నాయకులు పదాధికారులతో కలిసి నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జీవీఎల్ విలేకరులతో మాట్లాడుతూ ఆది నుంచి ఉన్న నిర్లక్ష్యం కారణంగానే ఉత్తరాంధ్ర వెనుకబాటుకు గురైందని తెలిపారు. ఐదు కులాల వారు ఓబీసీలో చేర్చాలని కోరారని, వారి కోరిక మేరకు ఇటీవల ఢిల్లీలో జాతీయ బీసీ కమీషన్ పబ్లిక్ హియరింగ్ ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణలో బీసీ జాబితాలో ఉన్న 27 కులాలను జాబితాలో తొలగించారని, వాటిని తిరిగి బీసీ జాబితాలో చేర్చేలా కృషిచేస్తున్నట్టు చెప్పారు. విశాఖపట్నం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందాలని విజన్-2030తో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలాసీతారామన్‌కు సమగ్ర ప్రణాళికను అందిస్తున్నామని వివరించారు. అంతకుముందు ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు అర్చకుల బృందం గౌరవ స్వాగతం పలికి దర్శనం చేయించారు.

నారాయణి నమోస్తుతే..!



పర్లాకిమిడి: హైస్కూల్ జంక్షన్ వద్ద ట్రక్కర్స్ అసోసియేషన్ మండపంలో..

శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి భక్తులకు రోజుకొక రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. పలు శక్తి పీఠాలతో పాటు గ్రామ వీధుల్లో ఆలయాలు, మండపాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: గాంధీ జంక్షన్ వద్ద దేవీ పూజలందుకుంటున్న దుర్గాదేవి



పర్లాకిమిడి: రైల్వేస్టేషన్ రోడ్డులో పిట్టల చెరువు వద్ద..



పర్లాకిమిడి: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



పర్లాకిమిడి: రాజగురు వీధి జంక్షన్‌లో..



భువనేశ్వర్: కాళ రాత్రి అలంకరణలో అరోగొదా అధిష్ఠాతి బవుతి మాత



భువనేశ్వర్: మహా కాళీ అలంకరణలో కటక్ చండీ మాత



రాయగడ: ఎస్‌బీఐ కూడలిలో కొలువుదీరిన అమ్మవారు



రాయగడ:-కంద్రవీధిలో గౌరీదేవి పూజలు



రాయగడ: మజ్జిగౌరి అమ్మవారికి హారతి



రాయగడ: నేతాజీ మార్గ్‌లో దుర్గాదేవి



భువనేశ్వర్: వైభవ వేంకటేశ్వరుని ఆలయంలో మహాలక్ష్మిగా దుర్గా దేవి



భువనేశ్వర్: మహిషాసుర మర్దినిగా బట్టొ మంగళా మాత



భువనేశ్వర్: మహా కాళీ స్వరూపంలో చవులియా గంజ్ జయదుర్గాదేవి

అయ్యప్ప గురుస్వామి మృతికి సంతాపం

పర్లాకిమిడి: స్థానిక పిన్నింటి పాపయ్యవీధిలో నివాసముంటున్న అయ్యప్ప గురుస్వామి ముందూరు రాజేంద్రప్రసాద్ ఆచారి (78) శుక్రవారం విశాఖపట్నంలో ప్రైవేటు ఆసుపత్రిలో గుండెపోటుతో మరణించారు. శనివారం ఉదయం పర్లాకిమిడిలో అంతిమయాత్ర నిర్వహించారు. ఇప్పటి వరకూ 39 సార్లు అయ్యప్ప మాల వేయడమే కాకుండా పొరుగున ఆంధ్రప్రదేశ్‌లో కూడా అనేక మంది అయ్యప్ప స్వాములకు గురుస్వామిగా, ఆలయ ధర్మకర్తగా వ్యవహరించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆచార మృతి పట్ల స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు, వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.



ఎం.రాజేంద్ర ప్రసాద్ ఆచారి(ఫైల్)

విపత్తులను ఎదుర్కొనేందుకు శిక్షణ



సమావేశంలో చర్చిస్తున్న ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: ఆకస్మిక, ప్రకృతి వైపరీత్యాల పట్ల పౌరుల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం శిక్షణ ఇచ్చేందుకు సంకల్పించింది. తొలి దశలో, మయూర్‌భంజ్, గంజాం, కెంజొహర్, బాలాసోర్, కటక్, సుందర్‌గఢ్, నవరంగపూర్, జాజ్‌పూర్, బొలంగీర్, కొరాపుట్‌లతో సహా పిడుగులు ఎక్కువగా ఉండే 10 జిల్లాల్లో శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తారు. తదుపరి దశల్లో ఇతర జిల్లాల్లో కార్యక్రమం నిర్వహిస్తారు. ఒడిశా రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఓస్డమా) 36వ నిర్వహణ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అధ్యక్షతన లోక్‌సేవా భవన్‌లో ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామం, మండల, పంచాయతీ స్థాయిలో విపత్తు నిర్వహణ సన్నద్ధత ప్రణాళిక అమలుపై సమావేశంలో చర్చించారు. వరదలు, తుఫాన్ వంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడం, పిడుగులు వంటి విపత్తుల నిర్వహణపై చర్చ జరిపారు.మెరుపులు, పిడుగుపాటు ప్రమాదాల నివారణపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తారు. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో ఫైర్ అలారం వ్యవస్థను ఏర్పాటు చేయాలని అనుబంధ వర్గాలు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకునివెళ్లారు.

భూకంపాలు, నీట మునిగిపోవడం, వరదల్లో కొట్టుకుపోవడం, పాముకాటు వంటి ఆకస్మిక విపత్తులను ఎదుర్కోవడాన్ని కూడా సాధారణ ప్రజానీకంలో అవగాహన కల్పించాలని చర్చించారు. వరద, తుఫాను షెల్టర్‌ల నిర్వహణ, మరమ్మతు కార్యకలాపాల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని అధికారులు, సిబ్బందికి సూచించారు. అన్ని షెల్టర్లలో మెరుపు రక్షణ వ్యవస్థను నిర్వహించడం, టవర్ లైట్ల ఏర్పాటు, పిడుగుపాటుకు సంబంధించి మొబైల్ ఫోన్ల ద్వారా ప్రజలకు సందేశాలు పంపడం వంటి అంశాలు సాధారణ నష్టతీవ్రత తగ్గించేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులందరికీ సామర్థ్య, నిర్మాణ శిక్షణ కల్పించాలని ప్రతిపాదించారు.

పారాదీప్‌లో నేవీ ఓడ అత్యవసర బెర్తింగ్



నేవీ ఓడ దర్శక్

భువనేశ్వర్: భారత నావికా దళానికి (ఐఎన్ఎస్) చెందిన ఓడను శనివారం జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ ఓడరేవులో అత్యవసరంగా నిలపాల్సి వచ్చింది. భారత నావికా దళానికి చెందిన సర్వే ఓడ ఐఎన్ఎస్ దర్శక్ సిబ్బందిలో ఒకరు అస్వస్థతకు గురికావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అత్యవసర వైద్య సహాయం అవసరం కావడంతో పారాదీప్ ఓడ రేవు అధికార వర్గాలతో సంప్రదించారు. తమిళనాడు కోయంబత్తూరుకు చెందిన సిబ్బందికి ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడింది. దీంతో తమ ప్రాంతంలో ఓడ నిలిపేందుకు పారాదీప్ పోర్టు ట్రస్టు సత్వర ఏర్పాట్లు చేసింది. తీరం చేరిన వెంటనే ఇండియన్ కోస్ట్ గార్డ్ అంబులెన్స్‌లో పారాదీప్ పోర్ట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం ఐఎన్ఎస్ చిలికాలోని నేవీ ఆస్పత్రికి తరలించారు.

ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ప్రచారంలో ఒడిశా కాంగ్రెస్ నేతలు



ఛత్తీస్‌గఢ్ పీసీసీ అధ్యక్షుడితో అవిభక్త కొరాపుట్ కాంగ్రెస్ నేతలు

భువనేశ్వర్: ఛత్తీస్‌గఢ్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రానికి చెందిన ముగ్గురు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు. వీరిలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి భక్త చరణ్ దాస్, కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలాకా ఉన్నారు. ఏఐసీసీ ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన 40 మంది సభ్యుల స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో వీరు చోటు దక్కించుకున్నారు. జాబితాలో పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్, రాష్ట్ర ఇన్‌చార్జ్ కుమారి సెల్జా, పార్టీ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి తదితరులు ఉన్నారు. ఛత్తీస్‌గఢ్ శాసన సభకు రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. మొదటి దశ 20 సీట్లకు ఈ ఏడాది నవంబర్ నెల 7న, మిగిలిన 70 స్థానాలకు నవంబర్ 17న పోలింగ్ జరుగుతుంది. డిసెంబర్ నెల 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.

జయపురం: ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టేందుకు అవిభక్త కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. వీరికి ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ దీపక్ బైజ్ స్వాగతం పలికారు. మల్కనగిరి జిల్లా అధ్యక్షుడు గోవింద పాత్రో, నవరంగపూర్ మాజీ ఎమ్మెల్యే భుజల్ మఝి, రాయగడ డీసీసీ అధ్యక్షుడు బిజయ కుమార్ గౌమాంగో, కొరాపుట్ జిల్లా పొట్టంగి మాజీ ఎమ్మెల్యే రామచంద్ర కడమ్, కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గ శంకర సాహు, కొరాపుట్ ఎంపీ ప్రతినిధి మనోజ్ కుమార్ ఆచార్య, నవరంగపూర్ డీసీసీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠీ, మల్కనగిరి మాజీ ఎమ్మెల్యే నిమయి చరణ సర్కార్ తదితరులు తరలివెళ్లారు.



శరత్ పట్నాయక్



భక్త చరణ్ దాస్



సప్తగిరి ఉలాకా

వైభవంగా సునావేశ సంబరం



దక్షిణ కాళీ మందిరం వద్ద భక్తజనం



నగర సంచారంలో మా బిజయ

జయపురం: జయపురం మహారాజుల కాలం నుంచి దసరా వేడుకల్లో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న దేవీ సునావేశ సంబరం ఈసారి కూడా వైభవంగా జరిగింది. జయపురం మహారాజుల ఆరాధ్యదైవాలలో ఒకటైన మా దక్షిణ కాళీకి సునావేశ(బంగారు నగల ధారణ) కార్యక్రమం శుక్రవారం రాత్రి కోలాహలంగా సాగింది. వేలాది మంది భక్తులు పూర్ణఘడ్‌లోని దక్షిణ కాళీ మందిరానికి చేరుకుని వేడుకలను తిలకించారు. అమ్మవారికి కంఠ మాల, కమరపట్టా, మణిబంధ, కాసుల మాల, కిరీటం, శంఖు చక్ర, హారాలను అలంకరించారు. సొరా సాహి బసంతి మా మందిర కూడలి వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రముఖ కళాకారుడు బాబూ పాణిగ్రహి బృందం సంగీత కార్యక్రమం శ్రోతలను అలరించింది. దసరా పూజా కమిటీ అధ్యక్షుడు, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పండగ ప్రాముఖ్యతను వివరించారు. పలువురు కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.





సాంస్కృతిక కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

వ్యక్తికి తీవ్రగాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్న

జియ్యమ్మవలస/ కురుపాం: బీజే పురం గ్రామం వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురుపాం గ్రామానికి చెందిన చిరు ధాన్యాల వ్యాపారి కందుల వెంకన్నకు తీవ్రగాయాలయ్యాయి. వెంకన్న తన ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని అంకవరం వెళ్తుండగా, అటువైపుగా వెళ్తున్న ట్రాక్టరును డ్రైవరు అకస్మాత్తుగా నిలిపి వేయడంతో ఆ ట్రాక్టరు ఢీకొని వెంకన్న గాయపడ్డాడు. స్థానికుల సహాయంతో వైద్యసేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని చినమేరంగి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనపై జియ్యమ్మవలస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చెరకు పంట దగ్ధం


కాలిపోయిన చెరకు పంట

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని గదబవలస గ్రామంలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో చెరకు పంట దగ్ధమైంది. ఉదయం 11 గంటల సమయంలో గ్రామానికి చెందిన ఎజ్జిపురపు సత్యం, ఎజ్జిపురపు అప్పలసూరి, ఎజ్జిపురపు వసంతలకు చెందిన పంట పొలంలో ఒక్కసారిగా పెద్దమంటలు వ్యాపించాయి. ఎకరానికి పైగా పంట కాలిపోయిందని, రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

అయోడైజ్డ్ ఉప్పు వినియోగం శ్రేయస్కరం

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు


జెండాఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: అయోడైజ్డ్ ఉప్పు వినియోగం శ్రేయస్కరమని, థైరాయిడ్ బారిన పడకుండా కాపాడుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద శనివారం గ్లోబల్ అయోడిన్ డెఫిసియన్సీ డే ర్యాలీను శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరం, మానసిక వికాసానికి అయోడైజ్డ్ ఉప్పు దోహదపడుతుందని తెలిపారు. గర్భిణులు అయోడిన్ ఉప్పు వినియోగించడం వల్ల గర్భంలోని శిశువు ఆరోగ్యంగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ పి.రవికుమార్, జిల్లా మలేరియా అధికారి మణి, డెమో వి.చిన్నతల్లి, ఎపిడిమాలజిస్టు డాక్టర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవాలకు షార్ట్‌ఫిల్మ్ పోటీలు

- 26వ తేదీలోగా ఎంట్రీలకు గడువు

విజయనగరం అర్బన్: విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని షార్ట్‌ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు యూత్‌వెల్ఫేర్ ఆఫీసర్ ఉజ్వల్ వెంకట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల్య వివాహాలు/పోషకాహార లోపం, రక్తహీనత అంశాలు ఇతివృత్తంగా తీసిన షార్ట్‌ఫిల్మ్ కాలవ్యవధి 5 నుంచి 10 నిమిషాలలోపు ఉండాలన్నారు. 15 నుంచి 30 సంవత్సరాలు నిండిన వారు అర్హులు. గత ఐదేళ్లలో బహుమతి పొందినవారు అనర్హులు. విజేతలను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారు. మొదటి ముగ్గురు విజేతలకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు చొప్పున విజయనగరం ఉత్సవాల చివరిరోజున ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా తమ ఎంట్రీలను జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి అందజేయాలని కోరారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

డెంకాడ: అమరవీరుల త్యాగాలు మరువలేనివని చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ ఇన్‌చార్జ్ అడిషనల్ కమాండెంట్ బి.ఆర్.శ్రీరాములు అన్నారు. శనివారం చింతలవలసలో జరిగిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొన్న ఆయన తొలుత అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి, నివాళులర్పించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను కొనియాడారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన

- పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి
- చంద్రబాబు హయాంలో దళితులపై దాడులు.. దౌర్జన్యాలు
- 26 నుంచి జరిగే సామాజిక సాధికారిత బస్సుయాత్రను విజయవంతం చేయాలి
- దళితుల ఆత్మీయ కలయికలో మంత్రి మేరుగు నాగార్జున


మాట్లాడుతున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున

విజయనగరం: రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. స్థానిక ఆర్‌టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లోని రెవెన్యూ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ దళితుల ఆత్మీయ కలయిక శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన 2024 ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగనన్న పాటుపడుతున్నారన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి చేపట్టనున్న సామాజిక సాధికారిత బస్సుయాత్రను విజయవంతం చేయడంలో దళితులు కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు హయాంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు తప్ప ఆయన దళితుల ప్రగతికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అని చంద్రబాబు చేసిన సంచలన వ్యాఖ్యలు యావత్తు దళిత జాతిని కలవరపాటుకు గురిచేసిందన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు అచ్చెన్నాయుడు దళితులను మోకాలితో తన్నిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. విశాఖలో ఓ దళిత మహిళను వివస్త్రను చేస్తే చంద్రబాబు కనీసం పట్టించుకోలేదన్నారు. టీడీపీ దళితులపై దాడులకు ప్రేరేపిస్తే వైఎస్సార్ సీపీ దళితులను అక్కున చేర్చుకుందన్నారు. బడుగు, బలహీన వర్గాల వారు తలెత్తుకుని జీవించేలా వైఎస్సార్ సీపీ పాలన ఉందన్నారు. విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం నిర్మిస్తోందని, ఇదే దళితుల పట్ల జగనన్నకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పార్టీ మరింత బలోపేతానికి, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలిచేందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎస్సీ, ఎస్టీల ఆర్థిక ప్రగతికి ఎంతో కృషి చేశారని, ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి అనేక సంస్కరణలు చేపడుతున్నారన్నారు. జిల్లాలోని ఎస్.కోట, గజపతినగరం, పార్వతీపురం, రాజాం నియోజకవర్గాల్లో జరిగే బస్సుయాత్రలను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాలకు జరిగిన మేలును వివరించేందుకు చేపట్టే బస్సుయాత్రను జయప్రదం చేయాలన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికల సమరంలో సీఎం జగనన్నకు అండగా దళిత వర్గం నిలబడాలని కోరారు.


సమావేశానికి హాజరైన దళితులు, దళిత సంఘాల నాయకులు

సీఎం జగన్‌తోనే సమసమాజ నిర్మాణం..

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ వెనకబడిన వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారం చాలా గొప్పదన్నారు. అంబేడ్కర్ కలలుగన్న సమసమాజ నిర్మాణానికి పాటుపడుతున్న వైఎస్సార్ సీపీని వచ్చే ఎన్నికల్లోనూ గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ పేదల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యమని, అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ఆయనదేనన్నారు. ఆయన చేపట్టిన ప్రతీ కార్యక్రమం ప్రజలకు చిరస్థాయిగా గుర్తుండిపోయే కార్యక్రమాలేనన్నారు. సమావేశంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవం పెంచిన జగనన్నకు మనమంతా అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.జైహింద్‌కుమార్, జిల్లా కార్యదర్శి రొంగలి పోతన్న, ఏపీ టూరిజం డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఆర్‌పీల పంచాయితీ

- గ్రూపుల వారీగా లెక్కలు తేల్చిన సీఐ శ్రీనివాసరావు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళల ఖాతాల నుంచి వారికి తెలియకుండా నగదు స్వాహా చేసిన ఆర్‌పీల పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. శనివారం రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయంలో సంఘాల మహిళలు, మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం, సీవో దానాలమ్మ, స్వాహాకు పాల్పడిన ఆర్‌పీ ఉమాదేవిలతో సీఐ ఎస్.శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామంలోనే మహిళలతో సమావేశం నిర్వహిస్తామని చెప్పిన పోలీసులు ఆఖరు నిమిషంలో రూరల్ సర్కిల్ కార్యాలయానికి మార్పు చేశారు. గ్రామంలో 26 గ్రూపుల్లో రూ.84 లక్షలు మేర అవకతవకలకు పాల్పడినట్లు గతంలో మెప్మా అధికారులు నిర్ధారించారు. కొన్ని గ్రూపులకు డబ్బులు చెల్లిస్తానని చెప్పిన ఉమాదేవి ఎప్పటికీ డబ్బులు జమ చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలు ఆమె ఇంటిని ముట్టడించారు. దీంతో రంగప్రవేశం చేసిన పోలీసులు ఆర్‌పీ అవకతవకలపై నిగ్గు తేలుస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం కూడా గ్రామానికి చెందిన తొమ్మిది గ్రూపులను క్షుణ్ణంగా పరిశీలించి, ఒక్కొక్క గ్రూపులో ఎంత మొత్తంలో మహిళలు నష్టపోయారన్న వివరాలు అడిగితెలుసుకున్నారు.

వాస్తవంగా అవకతవకలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించి, ఇందులో ఎవరెవరు ఉన్నారన్న దానిపై ఆరాతీస్తున్నారు. ఇదిలా ఉంటే ఆర్‌పీ సొమ్ములు వాడుకోవడం మేము బ్యాంకులో డబ్బులు చెల్లించాలా అనే నైరాశ్యంలో మహిళలు ఉన్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని వారంతా కోరుతున్నారు.

ఇల్లు కట్టకపోతే పట్టాలు రద్దు

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం: లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లల్లో నిర్మాణాలు చేపట్టని వారి ఇళ్ల పట్టాలను రద్దు చేసే అవకాశం ఉందని కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. కొంతమంది నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారని, నిర్మాణాలు ఏ దశలో ఉన్నా వాటిని రద్దు చేసి, అర్హులైన వారికి అందజేస్తామన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీస్ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైన ఆమె జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని సూచించారు. ఎప్పటికప్పుడు గృహనిర్మాణాలను పరిశీలించాలని, నిర్దేశిత సమయంలోగా నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై జరిగిన సమీక్షలో వైద్యశిబిరాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. ప్రతీ వైద్య శిబిరంలో ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులతో పాటు, మరో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఆప్తాలమిక్ అసిస్టెంట్లు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన రోగులను పర్యవేక్షించి, వారికి నవంబరు 15వ తేదీలోగా తదుపరి చికిత్సను అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు తమ పేర్లను యాప్‌లో రిజిస్టర్ చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్, డీపీవో నిర్మలాదేవి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

వైద్యుల గైర్హాజరుపై డీఎంహెచ్‌వో ఆగ్రహం

మెంటాడ: మండలంలోని చల్లపేట ప్రాథమిక ఆస్పత్రి వైద్యుల గైర్హాజరుపై డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా విధులకు డుమ్మా కొట్టిన ఇద్దరు వైద్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం మండలంలోని చల్లపేట, మెంటాడ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన చల్లపేట ఆస్పత్రిలో విధుల్లో ఉండాల్సిన ఇద్దరు వైద్యులు లేకపోవడంపై ఆరాతీశారు. వారు ఎటువంటి సెలవు పెట్టకుండా విధులకు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతీ పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఆస్పత్రులను అభివృద్ధి చేయడంతో పాటు సరిపడ మందులు, సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచుతోందని, ఈ నేపథ్యంలో వైద్యులే లేకపోతే ఆస్పత్రుల్లోని రోగులకు ఎలా మెరుగైన సేవలందుతాయని మండిపడ్డారు. అనంతరం ఆస్పత్రి రికార్డులు తనిఖీ చేసిన ఆయన రికార్డులు కూడా సక్రమంగా లేవని అసహనం వ్యక్తం చేశారు. రోగులతో మాట్లాడి, వైద్యసేవలు ఎలా అందుతున్నాయన్న విషయం అడిగి తెలుసుకున్నారు. సిబ్బందిలో 70 శాతానికి పైగా జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు సాగిస్తున్నారన్న విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో వైద్యుల సమావేశంలో దీనిపై మాట్లాడతానన్నారు. అలాగే అనుమతులు లేకుండా ల్యాబ్‌లు పెట్టినా.. అర్హత లేకుండా ఆర్‌ఎంపీలు వైద్యం చేసినా, వైద్యుని చీటీ లేకుండా మందుల షాపుల్లో మందులు అమ్మినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆ తర్వాత చల్లపేటలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆస్పత్రి భవనాన్ని ఆయన పరిశీలించి, త్వరలోనే ఆస్పత్రికి ప్రారంభిస్తామని, ఆ దిశగా సన్నాహాలు చేస్తున్నామన్నారు. మెంటాడ ఆస్పత్రిలో ఓపీలు ఎక్కువగా వస్తుండడంపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన రోగులకు మెరుగైన సేవలు అందేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.


చల్లపేట ఆస్పత్రిలో వైద్యుల గైర్హాజరును రికార్డులో నోట్ చేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

27న మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: జిల్లాలో రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి ప్రముఖ చలనచిత్ర సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ హాజరుకానున్నారని అకాడమీ ప్రిన్సిపాల్ రవి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటికే అకాడమీ వార్షికోత్సవం పురస్కరించుకుని, నాదారాధన పేరిట ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఈ నెల 15వ తేదీన పోటీలు నిర్వహించామని, 219 మంది వరకు పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి రోటరీ కమ్యూనిటీ హాల్‌లో సురేష్ చేతులమీదుగా బహుమతులు అందజేస్తామన్నారు.

సత్తాచాటిన పవిత్ర


బహుమతితో పవిత్ర, తదితరులు

బాడంగి: తిరుపతిలో జాతీయ స్థాయిలో శనివారం జరిగిన ఐదో ఇంటర్ స్టేట్ ఓపెన్‌తైక్వాండో చాంపియన్‌షిప్ ఫైనల్స్‌లో జిల్లాలోని బాడంగి మండలం, కోడూరుకు చెందిన అలజంగి పవిత్ర సత్తా చాటింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, చాంపియన్‌గా బహుమతి కైవసం చేసుకున్నట్లు మండల కోచ్, ఆమె తండ్రి అలజంగి ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆమెను గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అభినందించారు. ఆమె విజయానికి దోహదపడిన విశాఖ తైక్వాండో క్లబ్ కోచ్ పి.ఆనందరావు, కోడూరుకు చెందిన గోవిందరావు, ఎస్ఐ కొల్లి సతీష్‌లకు కృతజ్ఞతలని ఆయన తెలిపారు.

గోవింద్ చిరస్మరణీయుడు


గోవింద్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు

చీపురుపల్లిరూరల్: విధి నిర్వహణలో వీరమరణం పొందిన ఇండియన్ నేవీ మెరైన్ కమాండో చందక గోవింద్ విగ్రహాన్ని మండలంలోని పర్ల గ్రామంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపట్నం తూర్పుతీర నావికాదళ ఐఎన్ఎస్ కర్ణ విభాగం కెప్టెన్ చేతన్ మాట్లాడుతూ గోవింద్ చిరస్మరణీయుడని, ఆయన మరణం నేవీ రంగానికి తీరనిలోటన్నారు. ఆయన తన సేవలతో గుర్తింపును తెచ్చుకున్నారన్నారు. ఆయనకు ఉన్న ధైర్యం, తెగువ స్ఫూర్తిదాయకమన్నారు. 2023 ఏప్రిల్‌లో గోవింద్ వీరమరణం పొందిన విషయాన్ని గుర్తు చేసి, యువతలో దేశభక్తి నింపారు. కార్యక్రమంలో గోవింద్ కుటుంబ సభ్యులు, రిటైర్డ్ డీఈవో మీసాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పురందరేశ్వరి, పవన్‌లు ఏ పాత్ర పోషిస్తున్నారు..?

- వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న జూపూడి ప్రభాకరరావు

విజయనగరం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్ర రాజకీయాల్లో ఏ పాత్ర పోషిస్తున్నారో అర్థం కావడంలేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు వాఖ్యానించారు. విజయనగరంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఓ పార్టీకి అధ్యక్షులుగా ఉంటూ టీడీపీని ఆ ఇద్దరు నాయకులు తమ భుజాలపై మోయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే చంద్రబాబు స్కిల్ స్కాంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టు అయ్యారని, అటువంటి అవినీతి పరుడిని కాపాడేందుకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తన తండ్రి మరణానంతరం సోనియాగాంధీని ఎదురించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తుంటే..... జగన్‌మోహన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబును అరెస్టు చేయించారంటూ ఆరోపణలు చేయడాన్ని తప్పుబట్టారు. చట్టప్రకారమే చంద్రబాబు అవినీతి ఆరోపణలతో జైలుకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. చంద్రబాబు చేసిన మరిన్ని అవినీతి కార్యక్రమాలు త్వరలో వెలుగులోకి రానున్నాయని, అవినీతి చేయకుంటే చంద్రబాబు పీఏ ఎందుకు బయటకు రావడంలేదని ప్రశ్నించారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు చేసిందేమీ లేదని... పేదల కష్ట, సుఖాలు తెలుసుకున్న ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 35 లక్షల ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు కట్టించి ఇస్తున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా పాలనసాగిస్తున్న జగనన్న ఆలోచన విధానం అభినందించదగ్గదని పేర్కొన్నారు. గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాలకు చేసిన మంచిని వివరించేందుకు ఈనెల 26 నుంచి చేపట్టనున్న సామాజిక సాధికారిక బస్సుయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎం.అరుణ్‌కుమార్, ఎమ్మెల్యేలు కంబాల జోగులు, అలజంగి జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ ర్యాలీని విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ సుధాకర్

- మెప్మా పీడీ సుధాకర్

విజయనగరం రూరల్: విజయనగరం ఉత్సవాల నేపథ్యంలో నగరంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించే ఉత్సవ ర్యాలీని విజయవంతం చేద్దామని మెప్మా పీడీ సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం ఇదే విషయమై స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆయన పైడితల్లి ఆలయం నుంచి గంటస్తంభం వరకు జోన్-1, గంటస్తంభం నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు జోన్-2, గంటస్తంభం నుంచి స్టేట్‌బ్యాంకు వరకు జోన్-3గా విభజించి, ర్యాలీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ర్యాలీలో పాల్గొనేవారు ఏ జోన్‌లో ఉండాలనేది తెలియజేశామని, వారికి తెలియజేసిన సమయాల్లో ఆయా జోన్లలోనే ర్యాలీకి సిద్ధంగా ఉండాలన్నారు. కళాకారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బ్యానర్లను ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ విద్యా సమన్వయాధికారి డి.మన్మథకుమార్, డీఎస్పీ గోవిందరావు, ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు..

విజయనగరం అర్బన్: విజయనగరం ఉత్సవాలు పురస్కరించుకుని, విద్యార్థుల మధ్య సాహితీ పోటీలు నిర్వహిస్తున్నట్లు మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సాహితీ వేదిక పేరిట పద్యపఠనం, వ్యాసరచన వంటి సాహితీ అంశాలపై ఈ పోటీలు ఉంటాయన్నారు. స్థానిక సంస్కృత కళాశాలలో ఈ నెల 26వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పాఠశాల, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల జూనియర్ విభాగానికి 6, 7, 8 తరగతుల విద్యార్థులు, సీనియర్ విభాగానికి 9, 10 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. పద్యపఠన పోటీల్లో జూనియర్ కేటగిరీకి ఏవైనా మూడు నీతిశతక పద్యాలను భావయుక్తంగా, శ్రావ్యంగా చదవాల్సి ఉంటుందన్నారు. అలాగే సీనియర్ కేటగిరీ విద్యార్థులు భాస్కర, దాశరథి, శ్రీకాళహస్తీశ్వర శతకాల నుంచి ఏవైనా మూడు పద్యాలను భావయుక్తంగా, శ్రావ్యంగా చదవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలను ఫోన్ నంబర్ 9441427386ను సంప్రదించాలని కోరారు.

పోలీసుల త్యాగఫలంతో.. స్వేచ్ఛాయుత జీవనం




అమరవీరుల పరేడ్‌లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

- శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


స్మృతి చిహ్నం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీఎం.దీపిక

విజయనగరం క్రైమ్: సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే పోలీసుల త్యాగఫలమే కారణమని రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని స్మృతివనంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి అమరవీరుల స్మృతి స్థూపంపై పూలమాలలు ఉంచి అంజలి ఘటించారు. దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఈ ఏడాది అమరులైన 188 మంది పోలీసుల వివరాలతో కూడిన ప్రతిని డిప్యూటీ స్పీకర్ ఆవిష్కరించగా, అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ పేర్లను చదివి, వినిపించారు. ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల చేతిలో అమరులైన వారి కుటుంబాలకు అండగా ఉంటామని కోలగట్ల తెలిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు చూపిస్తున్న అంకితభావం, సేవాదృక్పథం, త్యాగాల వల్లే మనమంతా ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నామన్నారు. పోలీసులు రాగద్వేషాలకతీతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నారన్నారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడడంలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. విధుల్లో ప్రాణాలు కోల్పోతున్న కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ దీపిక, అసిస్టెంట్ సెంట్రల్ ఇంటిలిజెన్స్ అధికారి లలిత్ మోహన్ పండా, డాక్టర్ మురళీ మోహన్, సెబ్ ఏఎస్పీ ఎస్.వెంకటరావు, ఏఆర్ ఏఎస్పీ ఎం.ఎం.సోల్మన్, అమరవీరులు చిట్టిపంతుల చిరంజీవిరావు, షేక్ ఇస్మాయిల్, ఎస్.సూర్యనారాయణ కుటుంబ సభ్యులు, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. రిజర్వు ఇన్స్‌పెక్టర్ ఎస్.గోపాలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పరేడ్ నిర్వహించగా, అమరవీరులకు తుపాకుల విన్యాసంతో అంజలిఘటించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి దిశ పోలీసు స్టేషన్ వరకు ఎస్పీ ఎం.దీపిక ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ అమరవీరుల సేవలను కీర్తిస్తూ, ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం


పైడినాయుడు(ఫైల్)

బొండపల్లి: రైలు ఢీకొని పిళ్లా పైడినాయుడు(53) అనే వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో శనివారం జరిగింది. విజయనగరం రైల్వే ఎస్ఐ రవివర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఇదే గ్రామానికి చెందిన పైడినాయుడు ఇదే గ్రామంలోని రైల్వే ట్రాకు దాటి, పొలానికి వెళ్తుండగా ట్రాకు మీదుగా దూసుకువస్తున్న రైలు బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి మృతదేహం తరలించారు.

భోగాపురం: టిప్పర్(లారీ) ఢీకొని, పసుపులేటి వెంకటరావు(61) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ దుర్ఘటన మండలంలోని ముక్కాం జంక్షన్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. భోగాపురానికి చెందిన అతడు వ్యవసాయ పనులు ముగించుకుని, ఇంటికి వస్తుండగా, ముక్కాం జంక్షన్ వద్ద రామచంద్రపేట క్వారీ నుంచి మెటల్ లోడుతో భోగాపురం వైపు వస్తున్న టిప్పర్ వెనకనుంచి ఆయనను ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడు సంఘటన స్థలంలోనే చనిపోయాడు. మృతుడికి భార్య కొండమ్మ, ఓ కూతురు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి మృతదేహం తరలించారని ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.